## అందంగా రూపుదిద్దుకున్న సర్కారు బడి



మిరుదొడ్డి జడ్పీ పాఠశాలలో నూతన టేబుల్స్‌పై కూర్చున్న విద్యార్థులు



మన ఊరు-మన బడిలో భాగంగా అందంగా రూపుదిద్దుకున్న మిరుదొడ్డి జడ్పీ పాఠశాల



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సిద్దిపేట పట్టణంలోని నెం.1 ప్రాథమిక పాఠశాల

# సర్కారు బడుల్లో సకల సౌలత్‌లు

నేడు విద్యా దినోత్సవం

**నాణ్యమైన విద్యకు కేరాఫ్ ప్రభుత్వ బడులు**

- మన ఊరు- మన బడి కింద వసతుల కల్పనకు శ్రీకారం
- మొదటి విడతలో జిల్లాలో 343 స్కూళ్లు ఎంపిక
- ముమ్మరంగా కొనసాగుతున్న పనులు
- ప్రారంభానికి సిద్ధంగా 32 పాఠశాలలు

సిద్దిపేట అర్బన్, జూన్ 19: నాడు సర్కారు బడులంటే అరకొర వసతులు.. ఇరుకైన తరగతి గదులు.. శిథిలావస్థలో ఉన్న భవనాలు దర్శనమిచ్చేవి. కానీ నేడు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా మన ఊరు -మన బడి కార్యక్రమం ద్వారా వసతుల కల్పనకు శ్రీకారం చుట్టింది. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించి.. నాణ్యమైన విద్యను అందించడంతో.. గత రెండు సంవత్సరాలుగా మెరుగైన ఫలితాలు వస్తున్నాయి. ఉత్తీర్ణత శాతంలో పదోతరగతి ఫలితాల్లో జిల్లా మొదటి, రెండో స్థానంలో నిలించింది. 2022 పది ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలువగా... ఈ సంవత్సరం కొద్దిపాటి తేడాతో రెండో స్థానంలో ఉండడం విశేషం. మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా మొత్తం 12 రకాల మౌలిక సదుపాయాలు కల్పించారు. జిల్లాలో మొత్తం 976 ప్రభుత్వ పాఠశాలలకు 343 పాఠశాలలను మొదటి విడతలో ఎంపిక చేసింది. ఈ మేరకు జిల్లాలో 100కు పైగా పాఠశాలల్లో 90 శాతం పైగా పనులు పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.



సిద్దిపేట పట్టణంలోని నెం.1 ప్రాథమిక పాఠశాలలో..

## మొదటి విడతలో ఎంపికైన 343 పాఠశాలలు

మన ఊరు-మన బడి కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా మొదటి విడతలో 343 ప్రభుత్వ పాఠశాలలను విద్యాశాఖ ఎంపిక చేసింది. ఇందులో 186 ప్రైమరీ పాఠశాలలు ఉండగా, 33 ప్రాథమికోన్నత పాఠశాలలు, 124 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మొత్తం జిల్లా పరిధిలో 976 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, అందులో 636 ప్రాథమిక పాఠశాలలు, 113 ప్రాథమికోన్నత పాఠశాలలు, 227 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అయితే మొదటి విడతలో ప్రభుత్వం 35 శాతం పాఠశాలలను మన ఊరు-మన బడి కార్యక్రమానికి ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఇందులో దౌల్తాబాద్ మండలంలో 12 పాఠశాలలు, దుబ్బాక మండలంలో 25, మిరుదొడ్డిలో 14, రాయపోల్‌లో 10, తొగుటలో 14, గజ్వేల్‌లో 20, జగదేవ్‌పూర్‌లో 15, కొండపాకలో 20, మర్కూక్‌లో 8, ములుగులో 14, వర్గల్‌లో 16, అక్కన్నపేట్‌లో 22, హుస్నాబాద్‌లో 10, కోహెడలో 17, చేర్యాలలో 19, ధూల్‌మిట్టలో 5, కొమురవెల్లిలో 6, మద్దూరులో 8, బెజ్జంకిలో 12, చిన్నకోడూరులో 19, నంగునూరులో 18, నారాయణరావుపేటలో 6, సిద్దిపేట రూరల్‌లో 10, సిద్దిపేట అర్బన్‌లో 23 పాఠశాలలు ఉన్నాయి.

## మెరుగైన మౌలిక వసతుల కల్పన

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధనతో పాటు మన ఊరు-మన బడిలో భాగంగా మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అదనపు తరగతులు, మేజర్, మైనర్ రిపేర్లు, తాగునీరు, విద్యుత్, డైనింగ్ హాల్, టాయిలెట్లు, ప్రహరీ నిర్మాణం, కిచెన్ షెడ్ పనులు, ఈజీఎస్‌లో భాగంగా టాయిలెట్లు, ప్రహరీ నిర్మాణం, కిచెన్ షెడ్ పనులు చేపట్టారు. పనులు పూర్తయిన పాఠశాలలకు డ్యూయల్ డెస్కులు, గ్రీన్ చాక్ బోర్డులు ఇప్పటికే పంపిణీ చేశారు. జిల్లాలో మొదటి విడతలో ఎంపికైన 343 పాఠశాలలకు రూ.30 లక్షల దిగువ ఉన్న 243 పాఠశాలల్లో 241 పాఠశాలల్లో పనులు కొనసాగుతున్నాయి. అదే విధంగా రూ. 30 లక్షలకు పైగా అంచనా విలువ ఉన్న 97 పాఠశాలలకు దాదాపు అన్ని పాఠశాలల్లో పనులు కొనసాగుతున్నాయి.



## ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

సిద్దిపేట అర్బన్, జూన్ 19: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సిద్దిపేట పట్టణ శివారులోని పోలీస్ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం జరుగనున్న విద్యాదినోత్సవం ఏర్పాట్లను సోమవారం కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా విద్యలో దినాదినాభివృద్ధి చెందుతుందన్నారు. జిల్లాలో టెన్త్ ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలు, 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా నగదు బహుమతి అందించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. మన ఊరు-మన బడి కార్యక్రమం ద్వారా పనులు పూర్తయిన పాఠశాలలను ప్రారంభోత్సానికి సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి ఓఎస్‌డీ బాలరాజు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



సిద్దిపేట పట్టణ శివారులోని పోలీస్ కన్వెన్షన్‌హాల్‌లో విద్యాదినోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్



తోర్నాల మండల పరిషత్ పాఠశాలలో నూతన డెస్కుల్లో కూర్చున్న విద్యార్థులు

## కార్పొరేట్‌ను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలు

సిద్దిపేట రూరల్, జూన్19: కార్పొరేట్ పాఠశాలలకు ఏ మాత్రం తీసిపోకుండా ప్రభుత్వ స్కూళ్లు సకల వసతులతో కొత్తరూపు సంతరించుకున్నాయి. సిద్దిపేట రూరల్ మండలంలోని తోర్నాల, చింతమడక, రాఘవాపూర్ పాఠశాలలు మన ఊరు-మన బడిలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన పనులతో మెరుస్తున్నాయి. దీంతో విద్యార్థుల ప్రవేశాలు పెరుగుతున్నాయి.



గజ్వేల్: కొల్గూర్‌లో 'మన ఊరు-మన బడి'లో భాగంగా ముస్తాబైన పాఠశాల



గజ్వేల్: బెజుగామ పాఠశాలలో డిజిటల్ తరగతి గదిలో విద్యార్థులు



దుబ్బాక: కార్పొరేట్‌కు దీటుగా దుబ్బాకలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



మన ఊరు-మన బడిలో భాగంగా నూతనంగా నిర్మించిన బెజ్జంకి ప్రాథమిక పాఠశాల



మద్దూరులో తుదిదశకు చేరిన తరగతి గదుల పనులు



రాయపోల్: కార్పొరేట్‌కు దీటుగా వడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



గజ్వేల్: పిడిచేడ్‌లో 'మన ఊరు-మన బడి'లో భాగంగా ముస్తాబైన పాఠశాల



దుబ్బాక: పద్మనాభునిపల్లిలో నిర్మించిన ప్రాథమికోన్నత పాఠశాల



కొండపాక(కుకునూరుపల్లి): ముస్తాబైన కుకునూరుపల్లి ప్రాథమిక పాఠశాల



మర్కూక్: మండలంలోని చేబర్తి ఎంపీపీఎస్ స్కూల్



రాయపోల్: కార్పొరేట్‌కు దీటుగా ముస్తాబైన రాంసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



చేర్యాల: మన ఊరు-మన బడిలో భాగంగా రూపుదిద్దుకున్న కడవేర్గు ప్రాథమిక పాఠశాల



సిద్దిపేట పట్టణంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన నల్లాలు

## నేడు విద్యాదినోత్సవం

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పోలీస్ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం విద్యా దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యా దినోత్సవంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా మన ఊరు- మన బడి కార్యక్రమం ద్వారా 100 శాతం పనులు పూర్తి చేసుకున్న 32 పాఠశాలలను ప్రారంభానికి సిద్ధం చేశారు. అదే విధంగా ఆయా పాఠశాలల్లో సిద్ధంగా ఉన్న గ్రంథాలయాలు, డిజిటల్ క్లాస్ రూమ్‌లను సైతం ప్రారంభించనున్నారు. అన్ని పాఠశాలలను మామిడి తోరణాలు, పూలతో అందంగా అలంకరించారు. టెన్త్ పరీక్షా ఫలితాల్లో వంద శాతం పొందిన ప్రభుత్వ పాఠశాలలకు, 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి అందించనున్నట్లు అధికారులు తెలిపారు.



మన ఊరు-మన బడి కార్యక్రమం కింద అందంగా తీర్చిదిద్దిన దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల